

# నీవు వచ్చేవనీ...నీ పిలుపేవిని

## – విజయరాణి కోడూరి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

**(గత సంచిక తరువాయి)**

**పోకెట్‌లో** కర్చీఫ్ కోసం చూశాడు. లేదు, అపుడు గుర్తువచ్చింది అతడికి. అక్కడ తాటాకు మీద ఉన్న కర్చీఫ్ మూటను విప్పి, రాళ్ళను తాటాకుపై పోసేశాడు. కర్చీఫ్‌ను తడిపి, పిండి గాయానికి కట్టాడు టైట్‌గా. రక్తం కారుతుంది, అక్కడ తన చేత్తో నొక్కి ఉంచాడు. లత చేతిని పైకి పెట్టి, "క్రిందకు వాల్చకు లతా" అని చెప్పాడు.

లత కళ్ళనుండి రాలటానికి సిద్ధంగా ఉన్న కన్నీటి బొట్లను చూసి బాధనిపించింది అతడికి.

"నొప్పిగా వుందా లతా?" అడిగాడు.

అపుడు కాపలా వ్యక్తి వచ్చాడు. చూసి నొచ్చుకున్నాడు, అదే టైముకు ఎవరో పిలిస్తే వెళ్ళినందుకు బాధపడుతూ.

"సారూ కొంచెం పసుపు పొడితేనా?" అడిగాడతడు.

"వద్దయ్యా, థ్యాంక్స్" అంటూ లతను తీసుకుని కారు దగ్గరకు నడిచాడు.

లెఫ్ట్ డోర్ తెరిచి లతను ఎక్కమని డోర్ మూసి, డ్రైవింగ్ సీట్‌లో కూర్చున్నాడు హేమంత్. అతడి ముఖం అప్రసన్నంగా మారింది. కారు స్టార్ట్ చేశాడు.

"చేతిని కాలుపై పెట్టుకో, పైకి ఎత్తి ఉంచి" అని చెప్పాడు.

మౌనం గా ఉండిపోయింది లత.

"నువ్వు అటువంటి కత్తితో అలా కొయ్యొచ్చా? తిరిగి అన్నాడు"

మాట్లాడలేదు తల వాల్చి.

"చెప్పు లతా ఇంకా పెద్దగా ప్రమాదం జరిగితే."

"సారీ" అంది.

"నాకు సారీ ఎందుకు ? నొప్పితో నువ్వే బాధపడుతున్నావ్ కదా."

" అది అంత షార్ప్‌గా ఉందనుకోలేదు నేను."

"అతడు కాయలు కోసేటపుడు ఎలా తెగాయో చూసావు కదా లతా."

"చూసాను."

"నొప్పిగా ఉందా?" అంటూ ఎడమ చేతితో ఆమె తలను తన భుజంపైకి ఆనుకునేలా చేశాడు.

కొంచెం దూరం వెళ్ళాక కారుని మెడికల్ షాప్ దగ్గర ఆపాడు అతడు. వెళ్ళి మెడిసిన్స్ తెచ్చాడు. మళ్ళీ కారును స్టార్ట్ చేసి స్లోగా వెళ్తూ ఎక్కడ ఆగొచ్చు అని చూస్తున్నాడు.

రోడ్‌కు కొంచెం లోపలగా ఒక పెద్ద వేపచెట్టు ఉంది. ఆ నీడలో కారును ఆపాడు.

"లతా, దిగు. వెనుక సీట్లోకిరా." అంటూ దింపాడు చెయ్యి పట్టుకుని.

బ్యాక్ డోర్ వేసి "ఇక్కడ కూర్చో కాసేపు." అంటూ, తను అటువైపు డోర్ తీసుకుని ఎక్కాడు. ఫ్రంట్ సీట్లో ఉన్న మెడిసిన్స్ బ్యాగ్ తీసి ఇంజెక్షన్ లోడ్ చేసి "ఈ చేతికి ఇస్తా టిటి" అంటూ ఇంజెక్షన్ ఇచ్చాడు.

చిన్నగా నవ్వింది లత.

"ఇంజెక్షన్‌కు నొప్పి లేదా నవ్వు వస్తుంది!" అన్నాడు.

"ఎన్నిసార్లో ఏవో చిన్నగా గాయాలు అవుతూనే వుంటాయి. కాని శ్రద్ధగా టిటి చేసుకోం."

"బీయింగ్ ఎ మెడికో అదా చెప్తావ్?" అన్నాడు చిరుకోపంగా చూస్తూ. గాయాన్ని స్పిరిట్‌తో క్లీన్ చేసి కట్టు కట్టాడు.

"పెయిన్ తగ్గటానికి." అంటూ టాబ్లెట్, వాటర్ బాటిల్ ఇచ్చాడు.

"ఇపుడు ఓకెనా? బయలుదేరదామా?" అడిగాడు.

నెమ్మదిగా వాలి, అతడి ఒళ్ళో తలపెట్టుకుని పడుకుంది లత.

"కాసేపు హేమ్. కోప్పడకు. ఇలా నీ ఒడిలో ప్రశాంతంగా పడుకోనివ్వు" అంటూ.

తల నిమురుతున్న అతడి చేతిని చెంపకు ఆనించుకుంది.

"లతా, నాది కోపం కాదు. కన్‌సర్న్. అసలు నేను కారును ఆ తోట దగ్గర ఆపకుండా ఉంటే నీకు చెయ్యి తెగేది కాదు."

"నాకోసం ఇంత సేవ చేస్తున్నావ్ హేమంత్, లవ్ యు" అంది అతడి అరిచేతిని పెదవులతో తాకుతూ.

"లవ్ యు టూ లతా. ఇందాక తోటలో నా షర్ట్‌ను క్లీన్ చేసావు కదా నీ పల్లూతో,ఎందుకో చాలా హ్యాపీగా అనిపించింది నాకు. ఆక్షణంలో నాకూ నీలాగే అనిపించింది. నువ్వు తోడులేకుండా ఎలా వుండాలి అని."

"అవునా? ఏది ఫేస్, నావి చిన్న పిల్లల వేషాలు అన్నావు కదా?" అడిగింది.

నవ్వేసాడు "కాదా?"అంటూ.

"ఏది ఒక్కటి చెప్పు హేమ్." అంది.

"ఏదని చెప్పాలి, అన్నీ అవే." నవ్వేశాడు.

లత చేతిలో ఉన్న తన చేతిని చటుక్కున వెనక్కు తీసుకున్నాడు.

"ఇదిగో అమ్మాయ్, గిచ్చావంటే రాను తిరిగి. అక్కడే ఉండి పోతాను."

కంగారుగా లేచి అతడి పెదవులను మూసింది లత.

"ప్లీజ్ హేమ్, పరిహాసానికైనా అలా అనకు. చెప్పానుగా, కాని మాటలు అనకూడదని అమ్మ చెప్పింది. తథాస్తు దేవతలు ఉంటారట. వాళ్ళు మనం అన్నదే జరగాలని దీవిస్తారట" అంటూ అతడి గుండెలో తల దాచుకుంది.

"అనునులే. బి హ్యాపీ లతా. ఎందుకు అంతలా షివర్ అయిపోతున్నావ్? ఆర్ యు ఓకె?"

"చెప్పానుగా హేమ్, నాకెందుకో మనసులో చాలా అలజడిగా వుంది."

టెన్షన్ పెట్టుకోకు లతా. పోనీ ఒక పనిచెయ్యి. నేను వచ్చేవరకు నువ్వు కర్నూలుకు వెళ్ళిపో. నా నోట్ బుక్స్ ఉన్నాయి. తెచ్చి ఇస్తాను నీకు. ఎగ్జామ్స్కు అక్కడే ప్రిపేర్ కావచ్చు. నేను ఎల్లుండి ఫ్లైట్ కు వెళ్తాను. నువ్వు కూడా ఆ రోజే బయలుదేరి వెళ్ళు, ఎలాగూ రమ్మంటున్నారు అన్నావుకదా."

"అలాగే. మళ్ళీ నువ్వు వచ్చే రోజుకు వచ్చేస్తాను."

"నవ్వు మరి, గుడ్ గళ్."

"ఒక కండిషన్. నాకు రోజూ కాల్ చెయ్యాలి."

"ఓకె. చెయ్యకుండా ఉండగలనా?"

"గుడ్ బోయ్." అంది నవ్వేస్తూ.

"మరి జర్నీ వెనక్కా, ముందుకా?"

"నీకు తెలియదా? సాయంత్రం వరకు నాతోనే వుంటానన్నావ్‌గా."

"అయితే పద, లే మరి. ఈ పొజిషన్‌లో బ్యాక్ సిట్‌లో నుంచి డ్రైవ్ చెయ్యటానికి కుదరదమ్మా." దిగి వెళ్ళి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు.

కారు బయలుదేరింది.

లెఫ్ట్ సైడ్ డోర్ తెరిచాడు, ఎక్కి కూర్చుంది లత.

"ఏమిటి మౌనగీతం?" అడిగాడు ఓరగా చూస్తు.

"ఏం లేదు."

"మనకు ఆకలిలాంటివేం లేవా?"

"ఎందుకుండవు? అన్నీ ఉంటాయి."

"ఆ అన్నీ ఏంటో?"

"ఇప్పుడు చెప్పను."

"అయితే ఇపుడు వేరే ఏదైనా మాట్లాడు. బోర్‌గా వుంది సైలెంట్‌గా వుంటే."

"ఒక సాంగ్ ప్లే చెయ్యి చెప్తాను. హాయిగా విందువుగాని."అంది.

"చెప్పు చూద్దాం."

"జంగ్లీలో లత సాంగ్."

"నువ్వు పాడతావా? తెలియదే" అంటూ లత అడిగిన పాట ప్లే చేశాడు లిస్ట్‌లో వెతికి.

'ఏహసాన్ తెరా హోగా ముఝ్ పర్...' అక్కడ నుంచి హేమంత్ పాటతోపాటు స్వరం కలిపాడు.

"ఇపుడెందుకు ఈ సాంగ్ కావలసి వచ్చిందమ్మా, టైమ్లీగా నన్ను హింసించటానికా?

వినాలనిపించిందా? వినిపించాలనిపించిందా?"

నవ్వేసింది అతడి భుజంపై తలవాల్చి.

"నువ్వు, ఈరోజునూ, నన్నూ మరిచిపోకుండా వుండటానికి."

"ఇంత హింసిస్తుంటే ఇక కారేం డ్రైవ్ చేస్తాను?" అంటూ పక్కకు తీసి ఆపేశాడు. పాట అయిపోయింది.

"నేను నీకు ఒక మంచి సాంగ్ ప్లే చేస్తాను విను.. నిన్ను హాస్టల్ దగ్గర డ్రాప్ చేసినపుడు, దిగి వెళిపోతుంటే కలిగే బాధతో నా మనసు పాడుకునే పాట."

"అభీ న జావో ఛోడ్ కర్ కె దిల్ అభీ భరా నహీ..." సాంగ్‌ను ఆపేసి కారు స్టార్ట్ చేశాడు.

"లతా ఇక నో సాంగ్స్, నో స్పీడ్ బ్రేకర్స్. అంటే అర్ధమైంది కదూ!"

"నాకు అన్నీ బాగానే అర్ధమవుతాయి."

"ముందు ఏమైనా తినాలి కదా మేడం, ఆకలి దంచేస్తుంది."

"అవును కదా" అంది.

"అవునూ నువ్వు హాయిగా ఏ కర్నూలు మెడికల్ కాలేజ్‌లోనో జాయిన్ అయి బుద్దిగా చదువుకోక వైజాగ్‌కు ఎందుకు వచ్చావమ్మా?"

"కారణం ఉంది. అక్కడ మాడాడీ ఇన్‌ఫ్లూయెన్స్‌ను బట్టీ, ఆయన పొలిటికల్ పలుకుబడిని ఉపయోగించుకుని మువ్ అవ్వటం ఇష్టంలేదు నాకు. నా టాలెంట్‌తో తెచ్చుకున్నాను సీట్."

"ఓహో."

"నాన్నగారు చిన్నప్పటినుంచి కూడా నా పార్టీయేగా. అమ్మ, అమ్మమ్మ అసలు మెడిసిన్‌కే పంపించొద్దనీ, పెళ్ళి చేసేయమనీ గోల చేసారు. అయినా నాన్నగారు ఇక్కడకు పంపించారు వాళ్ళ మాట వినకుండా."

"ఓహో, నా ఫ్యూచర్ అలా డిసైడ్ అయిందనమాట."

"మాట్లాడేదానికి ఏమైనా అర్ధం ఉందా?"

"ఒకసారి ఆలోచించు, చక్కగా అర్ధమవుతుంది."

పకపకా నవ్వేసింది లత "అర్ధమైంది." అంటూ.

"నా మనసు ఒకమాట అడుగుతుంది సార్.. జవాబు చెప్పండి" అంది తిరిగి.

"ఏమిటో ఆ మాఠ?" అన్నాడు 'ట 'ని ఒత్తి పలుకుతూ.

"అసలీ షాజహాన్ ఆగ్రాను వదిలేసి వైజాగ్‌కు ఎందుకు రావలసి వచ్చింది?"

"మాకీ బేగమ్  ఇధర్ హై! క్యా కరేంగే?" అన్నాడు హేమంత్ హిందీ లో ఏక్సెంట్‌ను మారుస్తూ.

నవ్వేసింది లత.

"ఎలా అంత టైమ్లీగా మాట్లాడ్తావ్ హేమంత్?" అంటూ.

కారు ఆగింది.

"అది తర్వాత తీరికగా డిస్కస్ చేద్దాంగాని రా, వచ్చేసాం" అంటూ డోర్ తీసుకుని దిగాడు హేమంత్.

లత కూడా దిగింది.

ఎదురుగా అలలు ఎగిసిపడుతూ నీలి సముద్రం. ఆ అలలపై ఎగురుతున్న పక్షులూ, తెల్లటి దూది పింజల్లా కదిలి వెళిపోతున్న మేఘాలు. చలి చలిగా వీస్తున్న గాలి, నిర్మలంగా కనిపిస్తున్న నీలి ఆకాశం.

"రా లతా" అన్నాడు హేమంత్.

"ఇది ఎక్కడ హేమ్?"

"భీమ్లీ అంటారు ఈ ఏరియాను."

"అవును, నేనూ విన్నాను" అంది.

"లతా టేబుల్స్ ఖాళీగా ఉన్నాయి. రా లంచ్ చేసేద్దాం" అంటూ లత భుజాల చుట్టూ చెయ్యి వేసి  తీసుకు వెళ్ళాడు.

అదొక రిసార్ట్. అన్ని సౌకర్యాలతో ఆహ్లాదకరంగా వుంది. చాలామంది టూరిస్టులే కనిపిస్తున్నారు.

"లతా, అదుగో అక్కడ వాష్ రూమ్స్ ఉన్నాయి. కాస్త రిఫ్రెష్ అయిరా. నేను ఇక్కడే ఉంటాను" అన్నాడు.

వెళ్ళింది లత.

వస్తూ పైట కొంగుతో ముఖం ఒత్తుకోవటం చూసిన హేమంత్, కారు దగ్గరకు వెళ్ళి ఆమె వెనుక సీట్లో మర్చిపోయిన హ్యాండ్ బాగ్‌ను తీసి తెచ్చాడు.

"ఇదిగో లతా నీ బ్యాగ్." అంటూ అందించాడు అతడు.

"మళ్ళీ వెళ్ళి కార్లో నుంచి తెచ్చావా హేమ్?" అంది.

"మర్చిపోయావని తెచ్చాను."

హోటల్‌లో సముద్రాన్ని ఫేస్ చేసి, కొంచెం ఎలివేట్ అయి టెర్రేస్ లాంటి ప్లేస్ అది. నిండా అందమైన పూలమొక్కలు, డెకరేషన్, ఫ్లోర్ అంతా గ్రాస్ మ్యాట్స్‌తో పచ్చగా కవర్ చేసి ఉంది.

సముద్రపు అలల హోరుతో కలిసి మ్యూజిక్ సన్నగా ప్లే అవుతుంది. వెయిటర్ తెచ్చిన మెను కార్డ్ చూసి లతకు ఇచ్చాడు.

"నీకు ఇష్టమైన అయిటమ్స్ ఉన్నాయేమో చూడు లతా." అంటూ.

"హేమ్ నువ్వే ఆర్డర్ చేసెయ్." అంది మెను కార్డ్ ఇచ్చేస్తూ."

ఆర్డర్ చేసాడు.

"ఇక్కడ బాగుంది కదూ." అన్నాడు.

"బాగుంది కాని ఇంత గేదరింగ్ ఎందుకో ఇబ్బందిగా అనిపిస్తుంది నాకు."

"అర్థమైంది నాకు. లంచ్ చేసి కిందకు వెళ్ళిపోదాం."

"సరే" అంది.

బిల్ పే చేసేసి వెయిట్ చేస్తున్నాడు హేమంత్.

"ఎందుకు ఇంకా ఆగటం?" అడిగింది లత.

ఐస్‌క్రీం వస్తుంది లతా. బాగుంటుంది లతా ఐస్‌క్రీం తినేసి, కాసేపు అలా సముద్రంతో ఆడుకుని రిటర్న్ అయిపోదాం సిక్స్ వరకు. ఓకెనా?"

"టైమ్ అసలు ఆరు అవ్వకుండా ఆగిపోతే బాగుండును హేమ్."

"నేను ప్రయాణం క్యాన్సిల్ చేసుకుంటానేమో అనిపిస్తుంది లతా."

"ఎందుకని?"

"ఎందుకా? అలా బేల ముఖం పెట్టేసి చూస్తుంటే నాకు మనస్థిమితం ఉండొద్దూ. వెళ్ళినా నువ్వే గుర్తొస్తావ్ అనుక్షణం. నువ్వు సంతోషంగా వుండు. ఎగ్జామ్స్ కు ప్రిపేర్ అవు. ఆలోగా వచ్చేస్తానుగా."

ఐస్‌క్రీం వచ్చింది. ఒక కప్పు లతకు దగ్గరగా నెట్టి, "తీసుకో లతా." అన్నాడు.

అలాగే ముఖంలోకి చూస్తున్న లతను "ఏమైంది, తిను లతా." అన్నాడు.

"ఈ గాయం ఏదో కుడిచేతికి అయినా బాగుండేది" అంది.

"ఏం? అయినది చాలలేదా?"

"అపుడు ఎంచక్కా నువ్వే తినిపించేవాడివి కదా" అంది.

"ఇపుడైతే ఏమైందిలే." అంటూ స్పూన్‌తో ఐస్‌క్రీం తీసి పెట్టాడు.

"థాంక్యూ హేమ్." అంటూ రెండో కప్పులో ఐస్‌క్రీమ్ ను స్పూన్‌తో తీసి హేమంత్‌కు పెట్టింది.

"ఇదిగో" అంటూ తన కప్పు అతడివైపు జరిపింది.

"ఇది నువ్వు తిను హేమ్ అది నేను తింటాను" అంటూ హేమంత్ కప్పు తను తీసుకుంది.

"ఏం చేశావ్ లతా?" అన్నాడు.

"చెప్పుకో చూద్దాం" అంది చిలిపిగా.

"బాగా అర్థమైంది కాని తొందరగా కానియ్" అన్నాడు."

"ఏమి అర్థమైంది?"

"నీకు బాగా పీక్ స్టేజ్‌లో ఉందని."

"అదేంటో పేరు చెప్పొచ్చుగా."

"నీకు తెలుసులే. అవునూ ఐస్‌క్రీం ఏమిటి ఇలావుంది?" అన్నాడు.

"బాగనే ఉందిగా."

"సంపెంగి స్మెల్ వస్తుంది." అన్నాడు నవ్వేస్తూ.

"నాకైతే హేమ్ స్మెల్ వస్తుంది." అతడి చేతిమీద చెయ్యి వేస్తూ అంది.

చెమ్మగిల్లినట్టున్న ఆమె కళ్ళను చూసి, దృష్టిని ఆమెపై నుంచి మరల్చుకున్నాడు.

'ఎలా ఈ అమ్మాయితో, మరీ సెన్సిటివ్ పాపం!' అనుకున్నాడు.

"లతా లవ్ యూ రా" అన్నాడు నెమ్మదిగా.

ఆమె మౌనంగా తింటుంటే, "నేను చెప్పింది నాకు తిరిగి రాలేదు" అన్నాడు.

"లవ్ యు టూ రా హేమంత్." అంది నవ్వేస్తూ.

"ఫర్వాలేదు, కంటిన్యూ చెయ్యి బాగుంది. ఇద్దరం ఉన్నపుడే సుమా." అన్నాడు.

"నో, హేమంత్, సరదాగా అన్నాను అంతే" అంది.

ఇద్దరూ లేచి మెట్లవైపు నడిచారు.

మెట్లు దిగి బీచ్‌వైపు నడిచారు. చాలామందితో కోలాహలంగా వుంది. ఎగిసి వస్తున్న కెరటాలతో ముందుకు వెనక్కు పరుగులు తీస్తూ కేరింతలు కొడుతున్నారు.

"అలా ముందుకు నడుద్దాం, పద లతా." అంటూ ఆమె చెయ్యి పట్టుకున్నాడు హేమంత్.

చెయ్యి పట్టుకోగానే కెవ్వుమంది "హేమ్!" అంటూ.

ఆగిపోయి చూశాడు కంగారుగా, గాయం ఉన్న చేతిని పట్టుకున్నాడు.

"సారీ అమ్మా." అంటూ చటుక్కున చెయ్యి వదిలేశాడు. అతడి ముఖంలోకి చూసింది.

"నొప్పి పుట్టి అలా జనం జడుసుకునేటంత గట్టిగా అరిచావా!"

"బాగా నొప్పి అనిపించింది హేమ్."

"బాధ కలిగితే 'అమ్మా' అని కదా అనాలి."

"ఇంతకుముందు అలాగే అనేదాన్ని హేమ్. ఇపుడు నా మనసంతా నువ్వే నిండిపోయి ఉన్నావ్. ఏ బాధ కలిగినా నిన్నే తలుస్తున్నాను అనుకోకుండా." అంటూ అతడిని చుట్టేసుకుంది లత.

నెమ్మదిగా చుట్టూ చూశాడు అతడు. చాలా దూరం వచ్చేసారు. జనం దూర దూరంగా ఎవరి ఆటల్లో వాళ్ళు వున్నారు.

"లతా,ఐ లవ్ యు సోమచ్ రా." అంటూ ఆమెను మరింత దగ్గరకు తీసుకుని కంపిస్తున్న ఆమె పెదవులను తాకదు.

అతడి కళ్ళలోకి చూసింది లత చెమ్మగిల్లిన కళ్ళతో నెమ్మదిగా దూరంగా జరుగుతూ.

" హేమ్ నువ్వు తిరిగి వచ్చే వరకు ఈ క్షణాలను నా మనసులో పదిలంగా దాచుకుంటాను. " అంది.

భారంగా నిట్టూర్చాడు హేమంత్.

నెమ్మదిగా అలల తాకిడి ఎక్కువ అవుతుంది. పాదాలను తడుపుతూ ఇంకా పైపైకి వస్తున్నాయి.

"రా లతా, అలా కూర్చుందాం" అన్నాడు.

కొంచెం వెనక్కు నడిచి ఎత్తుగా ఉన్న దిబ్బ మీద కూర్చున్నారు.

"లతా ఏం ఆలోచిస్తున్నావ్?" అన్నాడు గాయమైన ఆమె చేతిని నిమురుతూ.

"మన గురించే."

"అన్ని విషయాలు పక్కన పెట్టి శ్రద్ధగా చదువు లతా."

మౌనంగా ఉండిపోయింది.

"ఇది మన జీవితంలోకి మనం తొలి అడుగులు వేస్తున్న సమయం. నేను పేరెంట్స్‌తో మాట్లాడతాను. నువ్వూ వెళ్తున్నావుగా, మీ నాన్నగారితో మాట్లాడు. నీ ఎగ్జామ్స్ అయ్యాక మ్యారేజ్‌ను ప్లాన్ చేసుకుందాం పెద్దవాళ్ళ దీవెనలతో." అన్నాడు ఆమె ముఖం పైకెత్తి కళ్ళలోకి చూస్తూ.

ఆమె కనురెప్పలు వాలిపోయాయి. " ఓకే హేమ్. " అంది నెమ్మదిగా.

"లతా, నా పేరెంట్స్‌కి నేను ఒక్కడినే. నీ పరిస్థితి కూడా అదే కదా! వాళ్ళ మనసులను నొప్పించకుండా జాగ్రత్తగా చూసుకోవలసిన బాధ్యత మనది" ఒక్క క్షణం ఆగాడు అతడు.

కొంచె జరిగి నెమ్మదిగా అతడిని తన ఒడిలోకి తీసుకుంది లత. ఆమె ఒడిలో తలపెట్టుకుని పడుకున్నాడు హేమంత్.

"నేను ఇక్కడ మెడిసిన్‌లో చేరటం వాళ్ళకు ఇష్టంలేదు. పాపం, దూరంగా వెళ్ళొద్దనీ, అక్కడే దగ్గరగా జాయిన్ అవమని చెప్పారు. నేను వినలదు. కాని వారిని విడిచి వెళ్ళనూ లేక, అక్కడ ఉండనూ లేక ఒక ఘర్షణకు గురైన తరుణంలో పైన టెర్రేస్ మీద నిలబడి దూరంగా మంచు ముసుగులో పెళ్ళికూతురులా కనిపిస్తున్న తాజ్‌ను  చూస్తు నిలబడ్డాను.

అపుడూ డాడీ నాదగ్గరకు వచ్చారు. సౌదీలో వార్ సమయంలో ఎదుర్కొన్న కష్టాల గురించి చెప్పారు. అక్కడ ప్రశాంతత లేదు. ఒకరి గురించి ఒకరు కలలు కనలేదు మనలా! ప్రేమించుకోలేదు.

మానవత్వపు అంచులను కూడా దాటి గాయపడిన సైనికులకు తమ సేవలను అందించారు. ఒకరికొకరుగా నిలిచి, పరస్పరం బ్రతికించుకున్నారు. అస్వస్థకు, అపాయాలకు గురైన వేళలలో మనం హాయిగా మాట్లాడుకునే స్వీట్ నథింగ్స్ లేవు వారి మధ్య ఆ క్లిష్ట సమయంలో.

ఆ బాంబుల మ్రోతల మధ్య, చనిపోగా మిగిలిన సిబ్బంది, గాయపడి చికిత్స పొందుతున్న సైనికుల సమక్షంలో నాన్నగారు తన మెళ్ళో ఉన్న లాకెట్ చెయిన్‌ను తీసి అమ్మ మెళ్ళో వేసి ఆమెను భార్యగా స్వీకరించారు." ఒక్క క్షణం ఉద్వేగానికి గురై ఆగాడు అతడు.

మౌనంగా అతడి తల నిమురుతూ ఉండిపోయింది లత.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS